క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి నిమిత్తం వైఎస్సార్ జిల్లా కొత్రపాటిపల్లె గ్రామానికి చెందిన బాలబతిని ఆంజనేయులు, ఆయన సతీమణి అల్లూరమ్మ కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి ఆదివారం ఈ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాత కుటుంబ సభ్యులను పూలమాలతో సన్మానించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రత్యేక పూజలు



గణేశుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం పట్టణంలోని విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమం జరిగింది. అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి, వినాయక ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు కొట్రికె ఫణిరాజ్, సందు వెంకటరమణ, జొన్నలగడ్డ శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, ఆంజనేయగౌడ్ తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల : మండల పరిధిలోని ముద్దవరం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన సాకే సుధాకర్ ద్విచక్రవాహనంపై ముద్దవరం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, పెద్దమ్మ కనుమ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రహదారి పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. పంట పొలానికి వెళ్తున్న రైతు, రహదారి వెంట ప్రయాణిస్తున్న వారు గమనించి 108కు సమాచారం అందించారు. స్థానికులు సుధాకర్‌ను ఆటోలో బేతంచెర్లకు తరలిస్తుండగా, 108 వాహనం చేరుకుని ఆసుపత్రికి తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు తెలిసింది.

నేషనల్ స్పోర్ట్స్‌డేలో ప్రతిభ



మెడల్‌తో సుదర్శన్‌రెడ్డి

బేతంచెర్ల : పట్టణానికి చెందిన క్రీడాకారుడు సుదర్శన్ రెడ్డి ప్రతిభ చాటాడు. హైదరాబాదులో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ డే, సండే సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ సోని బాలదేవి చేతుల మీదుగా పార్టిసిపేషన్ మెడల్ అందుకున్నారు.

నేడు డోన్‌లో కలెక్టర్ ఫిర్యాదుల స్వీకరణ

డోన్ టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా హాజరుకానున్నట్లు ఆర్డీఓ నరసింహులు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతిపత్రాలను నేరుగా కలెక్టర్ గారికి అందజేసి సమస్యల పరిష్కారం పొందే అవకాశం ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డివిజన్ కేంద్రంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, సంబంధిత వివరాలతో సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ ఆదేశించారు. కలెక్టర్ సమక్షంలో జరుగుతున్న ఈ వేదిక ద్వారా స్థానిక సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఊరేగింపులో బాణాసంచా పేలుళ్లు



లడ్డూ దక్కించుకున్న భక్తుడి ఆనందం



ఊరేగింపులో మహిళల నృత్యం



నిమజ్జనం ప్రాంతంలో క్యూకట్టిన విగ్రహాలు



గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథుడు

నిమజ్జనం.. శోభాయమానం

- గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు
- డప్పు వాయిద్యాలు, నృత్యాలతో వేడుకగా శోభా యాత్ర
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రశాంతంగా నిమజ్జనోత్సవం

డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని వెంకటాపురం తుమ్మల చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం ఘనంగా జరిగింది. పట్టణంలో ఏర్పాటు చేసిన సుమారు 246 విగ్రహాలకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపి అనంతరం ఊరేగింపులతో నిమజ్జనానికి తరలించారు. చిన్న విగ్రహాలను ఆటోలు, జీపుల్లో తీసుకెళ్లగా, పెద్ద విగ్రహాలను ట్రాక్టర్లలో డ్రమ్స్ మోగిస్తూ, డ్యాన్సలతో యువత సందడి చేస్తూ నిమజ్జనం చేశారు. మహిళలు, పిల్లలు, యువత రంగులు చల్లుకుంటూ వాతావరణాన్ని పండుగలా మార్చారు.



దోన్‌లో విఘ్నేశ్వరుడి శోభా యాత్ర

ప్రత్యేక బందోబస్తు

డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, ఎస్ఐలు, ఏఎస్ఐలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక రూప్‌మ్యాప్‌లు అమలు చేయగా, సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్‌రూం నుంచి పర్యవేక్షించారు.

ప్రత్యేక ఏర్పాట్లు

చెరువు వద్ద క్రేన్‌లు, లైటింగ్, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక దళం, గజ ఈతగాళ్లను అధికారులు సిద్ధం చేశారు. వరుసగా విగ్రహాలను క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసి ఉత్సవాన్ని ప్రశాంతంగా ముగించారు.





డోన్: వేలంలో లడ్డూను దక్కించుకున్న ఆనందంలో భక్తుడి కుటుంబం, కృష్ణానగర్ వినాయకుడు



పట్టణంలో భక్తుల ఆనందోత్సాహం

హోరాహోరీగా వేలంపాటలు

వినాయక మండపాల్లో ఏర్పాటు చేసిన లడ్డూ, పూజా సామగ్రి, శేష వస్త్రాలు, నోట్ల దండలకు ఆదివారం నిర్వహించిన వేలంపాటలు హోరాహోరీగా సాగాయి. భక్తులు పోటీ పడి వేలంపాటల్లో పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణానగర్‌లో జరిగిన వేలంపాటలో శ్రీరామ స్వీట్స్ రమేష్‌రెడ్డి లడ్డూను రూ.1.60 లక్షలకు, శివరామిరెడ్డి పూజా సామగ్రి, పట్టు వస్త్రాలను రూ.లక్షకు దక్కించుకున్నారు. రూ.10, రూ.20 నోట్ల దండలను వరుసగా మౌలాలి రూ.27 వేలకు, అర్జున్‌రెడ్డి రూ.31 వేలకు, రూ.50 నోట్ల దండను రామకృష్ణ ఫ్యామిలీ రూ.1.30 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ వేలంపాటల ద్వారా మొత్తం రూ.4.48 లక్షల ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.



కోవెలకుంట్ల: వినాయక విగ్రహాల ఊరేగింపు



కోవెలకుంట్ల: కోలాటం ఆడుతున్న మహిళలు

వినాయక.. వీడ్కోలిక

కోవెలకుంట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కోవెలకుంట్ల పట్టణంలో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 47 చోట్ల కొలువుదీరిన గణనాథులు ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్నారు. చివరి రోజు ఆయా మండపాల్లో వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగించారు. గ్రామ పంచాయతీ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ముదిగేడు చౌరస్తా, పాండురంగస్వామి దేవాలయం, సంతపేట, గాంధీసెంటర్, అంకాలమ్మ చౌరస్తామీదుగా అశేష జనవాహిని, భక్తుల మధ్య ఊరేగింపు సాగింది. అనంతరం పట్టణ శివారులోని కుందూనదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. యువకుల నృత్యాలు, డీజే, డ్రమ్స్ అలరించాయి. కుందూనది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నిమజ్జన సందర్భంగా కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులను నదిలో దిగనీయకుండా గజ ఈతగాళ్ల సాయంతో విగ్రహాలను కుందూలో నిమజ్జనంగా చేసేలా చర్యలు చేపట్టారు.



సంజామల: గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

వెళ్లిరా వినాయక



బనగానపల్లెలో గణనాథుల ఊరేగింపు



బనగానపల్లె: కైప చెరువులో నిమజ్జనం

బనగానపల్లె: పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పెండేకంటి నగర్, బీసీ కాలనీ, పవర్‌హౌస్ ఏరియా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, కరీంబాగ్, కొండపేట, మంగళవారం పేట తదితర ప్రాంతాల్లో సుమారు 55 మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. చివరి రోజు ఆదివారం ఉదయం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా విగ్రహాలను తీసుకెళ్లి కైప చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని పెట్రోల్‌బంకు, ఆంజనేయస్వామి ఆలయం, పాతబస్టాండ్, జీఎం టాకీస్ మీదుగా ఊరేగింపు సాగింది. పిల్లలు, యువత, మహిళలు నృత్యాలతో, ఆనందోత్సవాలతో పాల్గొన్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జానపద కళాకారులు పాటలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సమన్వయంతో సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐలు కల్పన, వెంకటసుబ్బయ్య, రాజారెడ్డి, దుగ్గిరెడ్డి ఆధ్వర్యంలో 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పశువైద్యుడిని నియమించాలని ఆందోళన

ప్యాపిలి: జలదుర్గం పశువైద్యశాలలో రెగ్యులర్ పశు వైద్యుడిని నియమించాలని డోన్ నియోజకవర్గ ఆవాజ్ అధ్యక్షుడు రసూల్, సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పశువైద్యశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జలదుర్గం గ్రామంలో అధిక సంఖ్యలో జీవాలు ఉన్నాయన్నారు. వర్షాకాలం కావడంతో జీవాలకు వ్యాధులు సంక్రమిస్తున్నాయని తెలిపారు. స్థానికంగా పశువుల డాక్టర్ లేకపోవడంతో ఇప్పటికే పలు జీవాలు మృత్యువాత పడ్డాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జలదుర్గం పశువైద్యశాలకు పశువైద్యాధికారిని నియమించాలని కోరారు. వడ్డే శ్రీనివాసులు, గౌండా హుసేన్, నాగరాజు, ఖాజా బాషా, మాసూంవలి, దస్తగిరి, బాషా పాల్గొన్నారు.

పీ4తో బంగారు కుటుంబాలు ఎలా సాధ్యం

డోన్ టౌన్: ఉపాధి అవకాశాలు కల్పించకుండా, పేదలకు భూములు పంచకుండా పీ4 పథకం ద్వారా పేదలను బంగారు కుటుంబాలుగా మారుస్తామని ప్రభుత్వం చెప్పడం ప్రజలను మరోమారు మోసం చేయడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగరాజు విమర్శించారు. స్థానిక ఎన్‌జీవోస్ హోంలో ఆదివారం డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె మండలాలకు చెందిన సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం కార్పొరేట్ శక్తులకు సహజ వనరులను దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల పేరుతో అన్నివర్గాలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపుతున్నారని, దీని కోసం బషీర్‌బాగ్ తరహాలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం డోన్ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, నాయకులు ఎల్లయ్య, సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రద్దీకి తగ్గ బస్సులేవి?

- ఉచిత బస్సుతో పెరిగిన మహిళల ప్రయాణం
- విద్యార్థులు, సాధారణ ప్రయాణికులకు కష్టాలు

కొలిమిగుండ్ల: రద్దీకి తగ్గట్లుగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తోంది. దీంతో మహిళల ప్రయాణం పెరగడంతో బస్సులు రద్దీగా మారుతున్నాయి. ఉచిత బస్సు అమలు అయ్యాక ఒక్క సర్వీసు అదనంగా ఏర్పాటు చేయలేదు. బనగానపల్లె–తాడిపత్రి రూట్‌లో విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. కొలిమిగుండ్ల, బెలుం నుంచి చాలా మంది విద్యార్థులు అవుకు ఐటీఐ కళాశాలకు వెళుతారు. అలాగే అవుకు మండలం రామాపురం, చెర్లోపల్లె నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఇంటర్ కాలేజీకి వెళుతారు. అలాగే అవుకుతో పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు బనగానపల్లెకు పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల, బీఎడ్ కాలేజీలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసిన బస్సుల్లో అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రకరకాల పనుల నిమిత్తం మహిళలు ప్రయాణాలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగింది. బస్సులు రద్దీగా మారడంతో చాలా మంది నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. చివరకు ఫుట్‌బోర్డు మీద నిల్చొని ప్రమాదకరంగా వెళుతున్నారు. అదనపు సర్వీసులు లేకపోవడంతో బస్సులు సైతం ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సర్వీసులు పెంచాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



రద్దీగా ఉండడంతో నిల్చున్న విద్యార్థులు

3న యాగంటిలో బహిరంగ వేలాలు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పలు వ్యాపార కార్యకలాపాలకు ఈ నెల 3న బహిరంగ వేలాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. వేలాల్లో టెంకాయలు అమ్ముకునే హక్కు, పండ్లు మరియు బొమ్మలు అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, సామాన్లు భద్రపరచుకునే హక్కులను కేటాయించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు తగిన డిపాజిట్ చెల్లించి వేలాల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

దాడి చేసిన నలుగురిపై కేసు

కొలిమిగుండ్ల: మదనంతపురానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంధ్య గణేష్‌తో పాత కక్షలు పెట్టుకున్న అదే గ్రామానికి చెందిన నాగరి రమేష్, రాకేష్, శ్రీనాథ్, చిన్న కంబగిరి రాముడు అతనిపై దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్ తలకు గాయాలైనట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డు సుద్ద ఫ్యాక్టరీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన బి. రఘునాథ్ (19) పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓమిని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రఘునాథ్‌ను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఊరట

కొలిమిగుండ్ల: పింఛన్లలో కోత విధించేందుకు కూటమి ప్రభుత్వం అనర్హత పేరుతో దివ్యాంగులకు నోటీసులు పంపింది. దివ్యాంగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఎట్టకేలకు ప్రభుత్వం సెప్టెంబర్ నెల పింఛన్ సొమ్ము ఇచ్చేందుకు అంగీకరించింది. మండలంలో 191 మంది దివ్యాంగుల పింఛన్‌లను వివిధ రకాల కారణాలు చూపి తొలగిస్తున్నట్లు వారందరికీ నోటీసులు పంపారు. ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్ తీసుకుంటున్న వారిని సైతం అనర్హుల జాబితాలో పెట్టడంతో ఆందోళన చేపట్టారు. విమర్శలకు తలొగ్గిన ప్రభుత్వం తాత్కాలికంగా తొలగించకుండా పింఛన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఆగస్టు నెలలో 6988 పింఛన్‌లు ఉండగా సెప్టెంబర్ నెలకు 6978 మందికి నిధులను విడుదల చేసింది. పది మంది డెత్ కేసులు ఉండడంతో వాటి సంఖ్య తగ్గింది.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళలో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని ఆయా గ్రామాలకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో ఈ వారం వ్యవసాయానికి పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా అందించనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ దుర్గా శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, గిద్దలూరు, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, కానాల, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

డోన్‌లో పెరుగుతున్న డామినేషన్ కల్చర్

- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న స్థానిక వ్యాపారులు



గెలాక్సీ చికెన్ సెంటర్‌లో వాదనకు దిగిన వ్యాపారులు



కేరళ షోరూంలో వాదనకు దిగిన స్థానిక గార్మెంట్ వ్యాపారులు

డోన్: ఇటీవల కాలంలో నియోజకవర్గ కేంద్రమైన డోన్‌లో స్థానికేతర వ్యాపారులను బెదిరించే విష సంస్కృతి పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో పట్టణంలో చోటుచేసుకున్న అభివృద్ధి కారణంగా ఇతర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల వ్యాపారులు కూడా డోన్‌లో కొత్త వ్యాపారాలను ప్రారంభించారు. అయితే, ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని కొందరు కూటమి పార్టీల అండదండలున్న వ్యక్తులు స్థానికేతర వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. తాము చెప్పిన ధరలకే వస్తువులు అమ్మాలని, తక్కువకు విక్రయిస్తే ఊరు విడిచి వెళ్లాలంటూ హుకుం జారీ చేస్తున్నారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎద్దుల కాటన్, కేరళ ఫ్యాన్సీ షోరూములు, గెలాక్సీ చికెన్ సెంటర్ లాంటి కొత్త వ్యాపారాల ఏర్పాటు కొందరికి సహించలేని అంశమై, సిండికేట్‌గా ఏర్పడి బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాధితులు పోలీసులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ మున్సిపల్ కమిషనర్ ఈ వ్యవహారాన్ని డీఎస్పీ శ్రీనివాసులకు బదిలీ చేశారు. డీఎస్పీ స్థానిక వ్యాపారులను పిలిచి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. స్థానికేతరుల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవన్నారు. దేశంలో ఎవరు ఎక్కడైనా వ్యాపారం చేయవచ్చని, జీవనం సాగించవచ్చని ఆయన స్పష్టంచేశారు. డోన్ పట్టణంలో పెరుగుతున్న ఈ అణచివేత ధోరణి కొనసాగితే శాంతి భద్రతలకు భంగం కలగవచ్చని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఉల్లి నాణ్యతగా ఉంటేనే మద్దతు ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సెప్టెంబరు 1 నుంచి మార్క్‌ఫెడ్ ఉల్లి క్వింటాలుకు రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిగడ్డలను ఎఫ్ఏక్యూ నాణ్యతతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినందున సరుకును గ్రేడింగ్ చేసుకొని ఎలాంటి మురుగులు లేకుండా తగిన నాణ్యతతో తీసుకరావాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌కు ఉల్లిగడ్డలు తెచ్చే రైతులు పొలం పాసు పుస్తకం, ఈ–క్రాప్ బుకింగ్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాసు పుస్తకం నకళ్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నకిలీ డాక్యుమెంట్లతో ఆస్తి కాజేసేందుకు కుట్ర

కర్నూలు(సెంట్రల్): నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి తన ఇంటి స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్న కర్నూలుకు చెందిన జతరదొడ్డి స్వర్ణలత, ఆమె కుటుంబ సభ్యులు కిష్టఫర్, వెంకన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన బోగోలు లక్ష్మీకాంతరెడ్డి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాను కొనుగోలు చేసిన స్థలంలోకి తనను వెళ్లనీయకుండా పైన కనబరచిన వ్యక్తులు అడ్డుకుంటున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. అలాగే తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించేందుకు సహకరించిన రిజిస్ట్రేషన్ శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.